జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 17-06-2024 | సంపుటి: 2 సంచిక: 47 పేజీలు: 4 వెల : రూ.7

## నేడు జిల్లాకు.. బాబాయ్ అబ్బాయ్

* కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి రాక
* ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు
* ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ మైదానంలో అభినందన సభ
* నగరంలో భారీ ర్యాలీ



4లో



## పింఛన్.. పెంచేన్!

* సామాజిక పింఛన్ స్కీమ్‌లో సమూల మార్పులు
* ఎన్టీఆర్ భరోసాగా పేరు మార్పు
* రూ.4వేలకు పెంచుతూ సీఎం తొలి సంతకం
* జిల్లాలో 3,21,662మందికి లబ్ధి
* హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



**శ్రీకాకుళం జూన్ 16(వార్త):** సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల కష్టాలను, ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, వితంతువులు, దివ్యాంగులైన వైకల్యం ఉన్నవారి బాధలను తొలగించడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు పింఛన్ అనేది ఒక ప్రధాన సంక్షేమ చర్య. ఈ పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో శ్రీకాకుళం జిల్లాలోని సామాజిక పింఛన్ దారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బృహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు, ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ, జి.ఓ.ఎంఎస్.నం.43 తేదీ: 13.06.2024 ద్వారా జిల్లాలో 15 కేటగిరిలకు చెందిన వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలకు సామాజిక భద్రత పెన్షన్‌ల మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్యకారులు, ఏఆర్టీ (పిఎల్హెచ్ఐవి) వ్యక్తులు, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు, లింగమార్పిడి, డప్పు కళాకారులు, కళాకారులకు పెన్షన్లు నెలకు రూ.4వేలు, వికలాంగులు, బహుళ వైకల్య కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.6వేలు, పూర్తిగా వికలాంగులకు నెలకు రూ.10వేలు , దీర్ఘకాలిక వ్యాధులు అనగా ద్వైపాక్షిక ఎలిఫెంటియాసిస్-గ్రేడ్ 4, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి, ప్రభుత్వ మరియు నెట్‌వర్క్ ఆసుపత్రులలో డయాలసిస్ చేయించుకుంటున్న వారికి నెలకు రూ.10వేలు పెంచిన పెన్షన్‌ల స్కేల్‌ను జూలై 2024 నుండి చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుంది. ఎన్‌టిఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 3,21,662 మందికి లబ్ది చేకూరుతోంది. ప్రస్తుతం పింఛన్ల కోసం నెలకు రూ.93.94 కోట్లు

... మిగతా 4లో



## వేటకు..సిద్ధం

* ముగిసిన వేట విరామం
* నిషేధం ఎత్తివేసిన రాష్ట్ర ప్రభుత్వం
* చేపల వేటకు మత్స్యకారులు
* మత్స్యకార భరోసా కోసం ఎదురుచూపులు

**పలాస, జూన్ 16 (వార్త):** సముద్రంలో చేపల వేటకు రెండు నెలల పాటు ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ నిషేధం శనివారం నాటితో ముగిసింది. దీంతో మత్స్యకారులు ఆదివారం నుంచి సంద్రంలో చేపల వేటకు సిద్ధమయ్యారు. చేపల వేట, విక్రయాలు, రవాణా, ఇతర కార్యకలాపాల ఆధారంగా జిల్లాలో రెండు లక్షలకు పైగా గంగపుత్రుల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. జిల్లాలో 193 కిలోమీటర్ల వరకు ఉన్న సముద్ర తీర ప్రాంతంలో వేలాది మత్స్యకార కుటుంబాలు సముద్రం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 11 మండలాల్లో 154 మత్స్యకార గ్రామాలు ఉండగా, 60వేల మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వేటకు వెళ్లే పడవలు 6 వేలు వరకూ ఉన్నాయి. మారిన వాతావరణ పరిస్థితుల వల్ల ఇక్కడ సముద్రంలో చేపలు తగ్గిపోయాయి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వలలు, బోట్లు, తెప్పలు కొనుగోలు చేసిన తాము సముద్రంలో వేటకి వెళ్తే మత్స్యసంపద

... మిగతా 4లో



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పేద ముస్లింలకు సరుకుల పంపిణీ

**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** బక్రీద్‌ను పురస్కరించుకుని జామియా మసీదు ఆవరణలో జామియా మసీదు కమిటీ ప్రతినిధులు 100 మంది పేద ముస్లింలకు నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు జామియా మసీదులో ప్రత్యేక నమాజ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, గౌరవ అధ్యక్షుడు హాజీ అమిరుల్ల బేగ్, ఉపాధ్యక్షుడు హాజీ బయ్యా, సెక్రెటరీ అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ షుకుర్ ఖాన్, కోశాధికారి ఉస్మాన్, సభ్యులు గుత్తి రఫీ, కరీమ్, దాతలు జాఫర్ భాయ్, జిలాని ఖాన్, బహదూర్ జాని, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ సాదిక్ పాల్గొన్నారు.



# స్విమ్మింగ్‌కు పూర్వవైభవాన్ని తీసుకువస్తాం

*** ప్రభుత్వ ఆధీనంలో స్విమ్మింగ్ పూల్ నిర్వహించాలి * కోచ్‌లకు ఉన్నతస్థాయి శిక్షణ అందిస్తాం * అన్ని జిల్లాల్లోనూ అసోసియేషన్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి * ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం * నూతన అధ్యక్షుడిగా కె.ఎన్.ఎస్.వి ప్రసాద్, సెక్రటరీగా ఝాన్సీ**




**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** స్విమ్మింగ్‌కు రాష్ట్రంలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, కూటమి ప్రభుత్వం సహకారంతో మరలా స్విమ్మింగ్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం తెలిపారు. నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న హారికా కనస్ట్రక్షన్స్ కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం అబ్జర్వర్‌గా ఉంటూ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మోహన వెంకటరాం మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ నిర్వహణను ప్రస్తుతం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించాల్సి వస్తోందని ఇది వారికి చాలా భారంగా మారుతోందని చెప్పారు. సిబ్బంది కొరత కారణంగానే ప్రభుత్వం స్విమ్మింగ్ పూల్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు అప్పగిస్తోందని వివరించారు. ప్రభుత్వంతో చర్చించి శాప్ పరిధిలోకి స్విమ్మింగ్ నిర్వహణను తీసుకోవాలని చర్చిస్తామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ, ఏషియన్ పోటీలను నిర్వహించుకున్నామని, తిరిగి స్విమ్మింగ్‌కు మంచి రోజులు వచ్చాయన్నారు. ఫెడరేషన్ల సహకారంతో నేషనల్స్‌కు, సీనియర్ నేషనల్స్‌కు అధిక సంఖ్యలో క్రీడాకారులను పంపగలుగుతున్నామన్నారు. అలాగే పోటీల్లో గెలిచిన వారికి ఫెడరేషన్ సహకారంతో నగదు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్టు వివరించారు. హారికా ప్రసాద్ అసోసియేషన్ అద్భుతంగా నిర్వహిస్తున్నారని, ఆయన హయాంలో రాష్ట్రస్థాయి పోటీలను సైతం విజయవంతంగా నిర్వహించుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అధిక సంఖ్యలో జిల్లాలో కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారని ఇది శుభపరిణామంగా భావిస్తున్నానన్నారు. త్వరలోనే ఇక్కడి కోచ్‌లకు జాతీయ స్థాయి కోచ్‌లతో ఉన్నతమైన శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్ మరోసారి అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర సెక్రటరీ మోహన వెంకటరామును దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ సాంబమూర్తి, శాప్ తరపున వాలీబాల్ కోచ్ హరి పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా కె.ఎన్ఎస్‌వి ప్రసాద్ (హారికా ప్రసాద్), ఉపాధ్యక్షులుగా ఎన్ని సూర్యరావు, ఎస్.రాధా కృష్ణ, శాసపు జోగినాయుడు, ఎం.విష్ణుమూర్తి, జనరల్ సెక్రటరీ కె.ఝాన్సీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కాంతారావు, జాయింట్ సెక్రటరీలుగా పి.వర ప్రసాద్, వై.వెంకటేష్, బి.భాష, డి.చక్రధరరావులను ఎన్నుకున్నారు. అలాగే ట్రెజరర్‌గా బి సోమేశ్వరరావు, స్విమ్మింగ్ అడ్వైజర్స్‌గా డి.మురళీధరరావు, కె.ఆశిష్‌లు, లీగల్ అడ్వైజర్‌గా ఎ అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ లక్ష్మీనారాయణ, వై చంద్రశేఖర్, కె హారిక, బి అనంతరావు, ఎం శాంతరావు, బి. యశ్వంతరావు, టి సతీష్‌కుమార్, ఎస్ భార్గవ్, కె చంద్రభానులు ఎన్నికయ్యారు.




## వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన ర్యాలీ

**శ్రీకాకుళం టౌన్ జూన్ 16 (వార్త):** శ్రీకాకుళం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాంత అనురాగ నిలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులను నివారించడానికి వృద్ధుల పోషణ, సంరక్షణ, ఆస్తి, ప్రాణ రక్షణ విషయాలపై ప్రభుత్వ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సివుందన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌ను కేటాయించాలని, వృద్ధులకు రాయితీతో రైల్వే పాసులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు వృద్ధులు ర్యాలీ చేశారు. అనంతరం జేసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోమసుందరరావు, ప్రకాశరావు, అమీనుల్లా బేగ్, రామ్మోహన్ రావు, గణపతి రావు, పోలయ్య, సోమేష్ ప్రసాదరావు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

**టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ మాదిగ**



**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సవలపురపు వెంకటరమణ మాదిగ, 181వ బూత్ ఇంచార్జి, టిడిపి 16 డివిజన్ అధ్యక్షురాలు సవలపురపు లక్ష్మి అన్నారు. శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ గొంటివీధి ప్రజలు కూటమి అభ్యర్థి గొండు శంకర్‌కి సైకిల్ గుర్తు పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర పౌర విమానం శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి స్వాగతం పలికేందుకు సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రజలంతా తరలి రావాలని కోరారు.

# సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలి

*** షాపులు, బార్‌లు పది శాతం కేటాయించండి * ఓబీసీ జాబితాలో చేర్చాలి * సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాధ చౌదరి**




**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** నూతన ప్రభుత్వం అబ్కారీ విధానంలో షాపులు, బార్ కేటాయింపులో పది శాతం సొండి కులానికి కేటాయించాలని సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాధ చౌదరి కోరారు. నగరంలోని నాగావళి హెూటల్‌లో ఆదివారం ఏపీ రాష్ట్ర సొండి కుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సొండి కులస్తులం సుమారు ఒక లక్ష జనాభా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదన్నారు. సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కులం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, భాషాపరంగా అత్యంత వెనుకబడిన బీసీ కులమని చెప్పారు. గత ప్రభుత్వం పాత అబ్కారీ విధానాన్ని మార్చి ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించడం వల్ల తాము మా కులవృత్తిని పూర్తిగా కోల్పోయి తీవ్రమైన అన్యాయానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులానికి కుల వృత్తివరంగా ఎలాంటి ప్రత్యామ్నాయ, ఉపాధి అవకాశాలను కల్పించకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వానికి తెలంగాణా మాదిరి అబ్కారీ షాపుల కేటాయింపులో గౌడ, యాత వంటి కులస్తులకు కల్పించిన ప్రత్యేక రిజర్వేషన్ల విధానాన్ని తమ కులానికి ఈ రాష్ట్రంలో కూడా కల్పించాలని అనేక పర్యాయములు అభ్యర్థించామన్నారు. అయినప్పటికీ మాకు న్యాయం జరగలేదని చెప్పారు. 2023లో ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పటి ప్రతిపక్షనాయకులు నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా పార్వతీపురం బహిరంగ సభలో వారి ప్రభుత్వం వచ్చాక సొండి కులానికి తెలంగాణాలో గౌడ కులస్తులకు కల్పించిన మాదిరి మాకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తాము కోల్పోయిన బీసీ-ఏని పునరుద్ధరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న తమ కులస్తులను ఇదివరకు మాదిరిగా "ఆబార్జనల్ ట్రైబల్"గా గుర్తించాలని అభ్యర్థించారు. సొండి కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారన్నారు. సమావేశంలో కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రత్నాల నర్సింహమూర్తి, రత్నాల జగన్మోహనరావులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావులను సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాహుకారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సొండికుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

## కళింగ వైశ్య సేవా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ప్రధాన కేంద్రం బలగ ప్రాంతంలో శ్రీ వాసవి కళింగ వైశ్య సేవా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడ్ల మనోజ్ కుమార్, సలహాదారుగా బరాటం నర్సింగరావు, అధ్యక్షుడిగా సూరు చంద్రశేఖర రావు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ సత్యనారాయణ, కోశాధికారిగా బోయిన శంకర రావుగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా పొట్నూరు రమణయ్య, తూము సురేష్, సకలాభక్తుల దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా కింతలి కృష్ణంరాజు (రాజు), పొట్నూరు ఏడుకొండలు, వారణాసి రామారావు (రమేష్)లను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, పొట్నూరు వైకుంఠరావు, పొట్నూరు లక్ష్మణరావు, వైశ్యరాజు మోహన్, డా.జామిభీమ శంకర రావు, పీవీ రమణ, గుడ్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల్లో తూర్పుకాపులకు అవకాశమివ్వాలి

**తూర్పుకాపు సంక్షేమ సంఘం నాయకులు**

**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** నూతనంగా ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం త్వరలో ఎంపిక చేయనున్న నామినేటెడ్ పదవుల్లో శ్రీకాకుళం జిల్లాలోని తూర్పుకాపులకు సముచిత స్థానం కల్పించాలని శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు కోరారు. నగరంలోని వినీలా హెూటల్‌లో ఆదివారం తూర్పుకాపు సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరపున తూర్పుకాపుల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కిమిడి కళా వెంకటరావు, మామిడి గోవిందరావు, కొండపల్లి శ్రీనివాస్‌లతో పాటు ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో ఎంపిక చేయనున్న ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్ తదితర నామినేటెడ్ పదవుల్లో తూర్పుకాపులకు అగ్రతాంబూలం ఇవ్వాలని కోరారు. అలాగే తూర్పు కాపుల ఉద్యోగులపై వేధింపులు తగదని తెలిపారు. రాజకీయ కోణంలో వారిని వేధింపులకు గురి చేయకుండా వారిని స్వేచ్ఛగా పని చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 50 లక్షలు, ఉత్తరాంధ్రలో 30 లక్షలు, శ్రీకాకుళం జిల్లాలో 8.50లక్షల జనాభాతో అతి పెద్ద సామాజిక వర్గంగా ఉన్న తూర్పు కాపులకు స్వాతంత్ర్య అనంతరం వివిధ రాజకీయ పార్టీలు ఏ విధంగా గౌరవిస్తూ



వస్తున్నాయో అదే మాదిరిగా కూటమి ప్రభుత్వం కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, రాష్ట్ర మంత్రిగా కీలక భూమిక పోషిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రాడ కైలాషరావు, శాసపు జోగినాయుడు, కిలారి నారాయణరావు, బుడితి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, కెఎల్‌వి రాశేఖర్, లెంక గాంధీ, రౌతు గోపీ, పెంకి చైతన్య, మక్క శ్రీనివాస్, కురిటు దుర్గారావు, దన్నాన మోహన్, లావేటి సుందరరావు, వండాన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
జిల్లా వార్తలు



## నన్ను టార్చర్ చేయొద్దు: నెటిజన్స్‌కు రేణూ దేశాయ్ మెసేజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో పవన్ మాజీ భార్య రేణూ దేశాయ్ అభినందనలు కూడా తెలిపారు. ఐతే, రేణూ దేశాయ్ కి పవన్ ఫ్యాన్స్ నుంచి వరుస మెసేజ్‌లు వస్తున్నాయి. సోషల్ మీడియాలో పవన్ అభిమాని రేణూను ట్యాగ్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టారు. 'వదినగారూ దేవుడిని పెళ్లి చేసుకుని, ఆయన అంతరంగం తెలీకుండా వెళ్లిపోయారు. ఇంకొన్ని రోజులు ఓపిక పట్టుంటే బాగుండేది' అని ఆ పోస్ట్ సారాంశం. ఈ కామెంట్‌ను చూసిన రేణూ దేశాయ్ అసహనం వ్యక్తం చేస్తూ 'పవన్‌ను నేను వదిలేయలేదు. ఆయనే నన్ను వదిలేసి మరో పెళ్లి చేసుకున్నారు' అంటూ రిప్లై ఇచ్చి.. ఇక తనను టార్చర్ చేయకండి అంటూ మెసేజ్ పెట్టారు.

# చూడొచ్చు

**నటీనటులు:** అజయ్ ఘోష్, చాందిని చౌదరి, ఆమని, అమిత్ శర్మ, భాను చందర్ తదితరులు, దర్శకుడు: శివ పాలడుగు, నిర్మాతలు : హర్ష గారపాటి, రంగారావు గారపాటి, సంగీత దర్శకుడు: పవన్

క్యారెక్టర్ ఆర్టిస్ట్ అజయ్ ఘోష్ లీడ్ రోల్ లో నటించిన తాజా చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ అయ్యింది. టీజర్, ట్రైలర్లతో ఆడియెన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఎలా ఉందో ఈ రివ్యూలో చూద్దాం.

### కథ:

మూర్తి(అజయ్ ఘోష్) ఓ మ్యూజిక్ షాప్ నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. అయితే, అతడి ఆదాయం ఏమాత్రం సరిపోకపోవడంతో, ఆ షాపును అమ్మేయాలని అతడి భార్య(ఆమని) పోరు పెడుతూ ఉంటుంది. దీంతో మూర్తి డీజేగా మారాలని అనుకుంటాడు. దీని కోసం అంజనా (చాందిని చౌదరి) అతడికి సాయం చేసేందుకు ఒప్పుకుంటుంది. ఇంతకీ అంజనా ఎవరు..? మూర్తికి ఆమె సాయం ఎందుకు చేస్తుంది..? మూర్తి డీజే గా మారుతాడా..? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

### ప్లస్ పాయింట్స్:

క్యారెక్టర్ ఆర్టిస్ట్, విలన్ రోల్స్‌లో తన నటనతో మెప్పించిన అజయ్ ఘోష్, ఈ సినిమాలో లీడ్ రోల్ లో ఆకట్టుకున్నాడు. మూర్తి పాత్రలో అజయ్ ఘోష్ నటన చాలా బాగుంది. కొన్ని సీన్స్ లో ఆయన పర్ఫార్మెన్స్ కు ఆడియెన్స్ ఫిదా అవుతారు. అటు చాందిని చౌదరి కూడా బాగా నటించింది. ఓ 50 ఏళ్ల వ్యక్తికి సాయం చేసే పాత్రలో చాందిని చౌదరి మెప్పించింది. ఇక ఈ సినిమాలోని ఫస్ట్ హాఫ్ కథను చక్కగా ముందుకు తీసుకెళ్తుంది. కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయ్యాయి. సినిమాలోని కొన్ని డైలాగులు ఆడియెన్స్ ను సర్ ప్రైజ్ చేస్తాయి. చక్కటి నేపథ్య సంగీతం తో పాటు ఒకట్రెండు పాటలు కూడా వినసొంపుగా ఉంటాయి.

### మైనస్ పాయింట్స్:

ఈ సినిమాకు ఫస్ట్ హాఫ్ ఎంత ప్లస్ అయ్యిందో, సెకండ్ హాఫ్ అంత మైనస్‌గా నిలిచింది. ఓ దశలో సెకండాఫ్ సినిమాపై ఉన్న ఆసక్తిని పూర్తిగా తగ్గించేస్తుంది. కొన్ని సీన్స్‌లోని ఎమోషన్స్ ను బలవంతంగా ఇరికించినట్లుగా అనిపిస్తుంది. సినిమాలో ఆకట్టుకునే లైన్ ఉన్నప్పటికీ, దాన్ని ప్రెజెంట్ చేసిన తీరు దీన్ని ఓ రొటీన్ మూవీగా మార్చేస్తుంది. దీనికితోడు పేస్.. మరీ ముఖ్యంగా సెకండాఫ్ సినిమా రిజల్ట్ పై తీవ్ర ప్రభావం చూపెడుతుంది. ఈ సినిమాను మరింత పవర్ఫుల్ గా ప్రెజెంట్ చేసి ఉంటే, ప్రేక్షకులకు ఓ చక్కటి ఎక్స్ పీరియన్స్ కలిగేది.

### సాంకేతిక విభాగం:

శివ పాలడుగు తొలి ప్రయత్నంలో దర్శకుడి గా ఓకే అనిపించినా, రైటర్ గా మాత్రం మంచి రెస్పాన్స్ అందుకున్నాడు. కొన్ని డైలాగులు అతడి కి మంచి పేరును తీసుకొస్తాయి. నాగేశ్వర రెడ్డి ఎడిటింగ్ వర్క్ ఆకట్టుకునే విధంగా లేదు. సినిమాలోని చాలా సీన్స్ లో ఆయన పనితనం మిస్ ఫైర్ అయ్యింది. పవన్ అందించిన సంగీతం పర్వాలేదు. స్కోర్ తో పాటు సాంగ్స్ కూడా బాగుండి ఉంటే, సినిమాపై సంగీతం ప్రభావం ఉండేది. శ్రీనివాస్ బెజుగం సినిమాటోగ్రఫీ బాగుంది. చిత్ర నిర్మాణ విలువలు బాగున్నాయి.

### తీర్పు:

మొత్తంగా మ్యూజిక్ షాప్ మూర్తి సినిమాలో మంచి లైన్ ఉన్నప్పటికీ, దాన్ని ప్రెజెంట్ చేసిన విధానం ఈ మూవీని ఓ యావరేజ్ సినిమాగా నిలిపింది. అజయ్ ఘోష్ నటనతో మెప్పించే ప్రయత్నం చేసినా.. స్లో స్క్రీన్ ప్లే, సెకండాఫ్ లోని కొన్ని సీన్స్ ఈ సినిమాపై ఆసక్తిని తగ్గించాయి. ఈ సినిమాను ఒకసారి చూడొచ్చు.




# టీం ఇండియా కోచ్‌గా.. గంభీర్



**వార్త స్పోర్ట్స్:** టీమ్‌ఇండియా కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ఈ టీ20 ప్రపంచకప్‌తో ముగుస్తుంది. జులై 1 నుంచి కొత్త కోచ్ బాధ్యతలు స్వీకరిస్తాడని బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొత్త కోచ్‌గా ఎవరొస్తారన్న దానిపై ఉత్కంఠ ఇంకా వీడటం లేదు. భారత జట్టు కోచ్ పదవికి మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతడి ఎంపిక దాదాపు ఖరారైనట్లు కొన్ని రోజుల నుంచి వార్తలొస్తున్నాయి. కొత్త కోచ్ నియమాకం గురించి జూన్ చివర్లో బీసీసీఐ అధికారిక ప్రకటన చేయనుంది. "భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉండటానికి గంభీర్‌తో చర్చలు జరిపాం. అతను టీ20 ప్రపంచ కప్ తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేస్తాడు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కోచ్‌గా ఉండటానికి బీసీసీఐ ముందు గంభీర్ ఓ డిమాండ్ ఉంచినట్లు వార్తలొస్తు న్నాయి. సహాయక సిబ్బంది నియామకం విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని షరతు పెట్టాడట. అందుకు బోర్డు అంగీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్‌గా పరాస్ మంబ్రే, ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ ఉన్నారు. గంభీర్ సహాయక సిబ్బందిలోనే కాకుండా జట్టులోనూ మార్పులు చేస్తాడట. 'భారత జట్టుకు కోచ్‌గా ఉండాలని అనుకుంటున్నా. జాతీయ జట్టుకు శిక్షణ ఇవ్వడం కంటే గొప్ప గౌరవం మరొకటి ఉండదని అని గంభీర్ పేర్కొన్నాడు.



## అందాల రాక్షసి కృతి శెట్టి

తెలుగు ఇండస్ట్రీని ఒక ఊపు ఊపుతోంది. తన అందం.. అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తెలుగు, తమిళ్, కన్నడ చిత్రాల్లో నటిస్తోంది.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



జిల్లా వార్తలు

## మానవహక్కులపై అవగాహన అవసరం

**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (వార్త):** మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఏ స్థాయి అధికారిపైన అయినా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, ప్రతి ఒక్కరరికీ మానవహక్కులపై అవగాహన అవసరమని అఖిల భారత మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరీ నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట శ్రీకాకుళం కమిటీ సభ్యులు సంతోష్ కుమార్ సాహు, డా.సురేష్ పండా ఉన్నారు.





## ఆదిత్యుని ఆదాయం రూ.7.26 లక్షలు

**అరసవల్లి, జూన్ 16 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ ఒక్కరోజే స్వామి వారి ఆదాయం రూ.7,26,730లకు చేరింది. టికెట్లు రూపేనా రూ.3,96,000, పూజలు, విరాళాల రూపంలో రూ.78,890, ప్రసాదాల రూపంలో రూ.2,51,840 ఆదాయం వచ్చిందని ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే శ్రీకాకుళం జిల్లా, రెడ్డి కిల్లిపాలెం వాస్తవ్యుడు సింహాద్రి అప్పల రామేశ్వరం, కుమారుడు సింహాద్రి వెంకట రమణమూర్తి, జ్యోతి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారి తల్లి సింహాద్రి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం దేవస్థానంలో శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం రూ.1,00,116లను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు చెక్కు రూపంలో అందజేశారు.

## చంద్రమౌలీశ్వరరావు.. నేత్రదానం

**శ్రీకాకుళం టౌన్, జూన్16 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని చిన్న బరాటం వీధిలో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపార వేత్త చంద్రమౌళి డిపార్టు మెంట్ స్టోర్ యజమాని పట్నాల చంద్రమౌలిశ్వరరావు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చంద్రమౌలీశ్వరరావు నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు జామి రమేష్, పట్నాల నవీన్ కుమార్ నిర్ణయం తీసుకుని రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు సమాచారం అందించారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ సుజాత, సహాయకుడు ఉమా శంకర్ ద్వారా చంద్రమౌలీశ్వరరావు కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. మృతి చెందిన తర్వాత నేత్రదానం చేయడానికి ముందుకువచ్చిన దాత కుటుంబ సభ్యులను రెడ్ క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, దుర్గా శ్రీనివాస్ అభినందించారు. నేత్ర దానం చేయాలనుకునే వారు 78426 99321 నంబరుకు కాల్ చేయాలని వారు కోరారు.

## ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను కలిసిన ఎండీయూ ఆపరేటర్లు



**పాతపట్నం, జూన్ 16 (వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావును నియోజకవర్గానికి చెందిన ఎండీయూ ఆపరేటర్లు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఎండీయూ ఆపరేటర్లకు ఏ సమస్య లున్నా తమదృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి, పాతపట్నం, మండల అధ్యక్షులు వాసు, గోపి, నవీన్ శ్రీనివాస్, సాయిరాజ్, అనిల్, నియోజక వర్గ ఎండీయు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## అరుంధతిరాయ్‌పై కేసులను ఖండిస్తున్నాం



**పలాస, జూన్ 16 (వార్త):** ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్‌ని ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని ఖండించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐపీసీలోని తీవ్రమైన సెక్షన్ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి ఇవ్వడం ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతు ఎత్తేవారిని అణచివేయడంలో భాగమన్నారు. తక్షణం ఈ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## పవన్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వడం అభినందనీయం

**పలాస, జూన్ 16 (వార్త):** జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవిని సీఎం చంద్రబాబు ఇవ్వడం అభినందనీయమని పలాస జనసేన నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిఠాపురంలో జనసేనాని గెలుపునకు, పలాసలో గౌతు శిరీష విజయానికి తాను ప్రచారం చేశానన్నారు.

# స్వచ్ఛ నాగావళి.. మనందరి బాధ్యత

### శ్రీకాకుళం నగరపాలక ఆరోగ్యశాఖాధికారి వెంకటరావు - నాగావళి నది పరిశుభ్రతకు నడుమ బిగించిన యువత



**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** స్వచ్ఛ నాగావళి మనందరి బాధ్యత కావాలని, నదీజలాలు కలుషితం కాకుండా చూడడం సామాజిక బాధ్యతని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని హయాతినగరం ఒడ్డున నాగావళి నదిలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి నదిలోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ శ్రీకాకుళంలో భాగస్వాములు కావాలని కోరారు. నదుల్లో చెత్తను వేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. నదీ పరిసర ప్రాంతీయులు చెత్తను నదిలో వేయవద్దని కోరారు. వార్డుల్లోకి వచ్చే చెత్త తరలించే వాహనాలకు చెత్తను ఇవ్వాలని సూచించారు. అలాగే చెత్త కుండీల్లోనే వేయాలన్నారు. శ్రీకాకుళం నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దంలో సహకారం అందించాలన్నారు. నదిని శుభ్రం చేసేందుకు పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, సాసపు జోగినాయుడు, గోలీ ఉమా మహేశ్వర రావు, డాక్టర్ జీఎన్ రావు, టీడీపీ నేత తోలేటి వెంకన్న యాదవ్, ఐతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు ఆచార్య విష్ణుమూర్తి, డాక్టర్ బలరాం, హలో సిక్కోలు ప్రతినిధులు పి.ప్రశాంత్, మధు, ప్రణీత్, యువత పాల్గొన్నారు.

## జీవో 117ను రద్దు చేయాలి

### * విద్యాభివృద్ధికి పెద్దపీట వేయండి *ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు దిలీప్‌కుమార్

**శ్రీకాకుళం టౌన్, జూన్ 16 (నేడు న్యూస్):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం శ్రీకాకుళం ఎన్జీవో హోంలో ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలను సమానంగా కొనసాగించాలని, బకాయిలు తక్షణమే చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. గుణాత్మక విద్యను అందించడంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి పి.బాలాజీరావు, ఆర్వీ అనంతాచార్యులు, టి.గిరిరాజు, పి.ఆనందరావు, కె.రవికుమార్, జి.పోలీసు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



## పింఛన్.. పెంచెన్!

(మొదటిపేజీ తరువాయి)

చెల్లిస్తుండగా, ఇకనుంచీ అదనంగా మరికొంత నగదు జోడించి రూ.100 కోట్లకి పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా, జులైలో సాధారణ పింఛన్ దారులు ఒక్కొక్కరూ రూ.7వేలను వచ్చేనెల 1వ తేదీన అందుకోనున్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టుగానే ఏప్రిల్ మే జూన్ నెలల కాలానికి ఒక్కొక్క నెలకి పెంచిన మొత్తం రూ.1000 తో కలిపి 7వేల రూపాయలను జూలై ఒకటవ తేదీన ఇంటింటికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

### నవ శకానికి నాంది పలుకుతాం

ఒక గొప్ప సంకల్పం, భావితరాల కోసం మంచి విజన్ ఉన్న గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు. పేదలకు అధికారంలోకి రాగానే మూడు నెలల పెంచిన మొత్తంతో కలిపి 4000 నెల నెల ఇస్తామన్న హామీని నిలబెట్టేందుకు తొలి 5 సంతకాలలో ఒక సంతకంగా చేసి చరిత్రలో నిలిచిపోయిన గొప్ప సీఎం చంద్రబాబు. పాలనలో అద్భుతమైన సంస్కరణలు తీసుకురావడం ఆయనకే సొంతం. ముందు ముందు రాష్ట్రానికి మరిన్ని మంచి రోజులు రానున్నాయని ఘంటా పదంగా చెప్పగలను. యువ కెరటం లోకేష్ బాబు నాయకత్వంలో దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతుందని రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

**- మామిడి గోవిందరావు, పాతపట్నం ఎమ్మెల్యే**

## నేడు జిల్లాకు బాబాయ్, అబ్బాయ్

### * కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి రాక * ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు * ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ మైదానంలో అభినందన సభ

**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎన్ఏడీ వయా మద్దిలపాలెం మీదుగా ర్యాలీగా జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళం సింహద్వారం, డే అండ్ నైట్ కూడలి, ఏడురోడ్ల జంక్షన్, జీటీ రోడ్డు, సూర్యమహల్ జంక్షన్, అరసవల్లి జంక్షన్ మీదుగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇంటివరకు ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎంపీ కార్యాలయం నుంచి బయలుదేరి రామలక్ష్మణ జంక్షన్, పెద్దపాడు, జాతీయ రహదారి మీదుగా నిమ్మాడ చేరుకుంటారు. స్వర్గీయ ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద స్వాగతం పలికి బైక్‌ర్యాలీతో ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ మైదానంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించనున్నారు.

## వేటకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పడకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేటాడిన చేపలు నిలువ చేసేందుకు అనువైన జట్టీలు లేకపోవడంతో తక్కువ ధరకే మధ్యవర్తులకు అమ్ముకుంటున్నారు. చేపలు ఎండబెట్టుకునేందుకు వీలుగా ప్లాట్‌ఫారాలు లేక ఇళ్ల బయట, సముద్రం ఇసుక ఎండబెట్టుకున్నారు. పడవలు, వలలు ఉంచడానికి అనువైన ప్రదేశాలు లేవు. దీంతో సముద్ర తీరాల్లో ఉంచుతున్నారు. తుపాన్లు వచ్చే సమయంలో పడవలు, వలలు కొట్టుకుపోతున్నాయి. జట్టీలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. జిల్లాలో వేట కలిసి రాకపోవడంతో 35 వేల మందికి పైగా మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉపాధి పొందుతున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా, పుదుచ్చేరి, గుజరాత్, మహారాష్ట్ర, అండమాన్-నికోబార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. కాగా, వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా భృతి కొందరికే పరిమితమవుతోంది. వేట తప్ప వేరే ఉపాధి అవకాశాలు లేకపోవడంతో మత్స్యకారులు రెండు నెలలు ఖాళీగా ఉన్నారు. ఒక్కో మర పడవపై 15 నుంచి 18 మంది వేట సాగిస్తుండగా కేవలం ఆరుగురికి, చిన్న పడవపై ఆరుగురు వేట సాగిస్తుంటే ముగ్గురికి మాత్రమే మత్స్యకార భరోసా అందిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వేట సాగించే పడవల్లో కొన్ని మాత్రమే నమోదు కావడంతో సుమారు 15,500 మందిని పథకానికి అర్హులుగా గుర్తించారు. అదనంగా పడవలు సమకూర్చుకునే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు కొందరికే చెల్లిస్తున్నారు. వేటకు విరామం ముగిసినప్పటికీ మత్స్యకార భరోసా సొమ్ము నేటికీ లబ్ధిదారుల ఖాతాలో జమ కాలేదని మత్స్యకారులు చెబుతున్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, APTEL:016413


హృదయపూర్వక శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషులు, సిక్కోలు సింహం గౌ॥ శ్రీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు గారు పౌర విమానయాన శాఖామాత్యులుగా మరియు గౌ॥ శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా మరియు అఖండ మెజార్టీతో గెలుపొంది నేడు జిల్లాకు విచ్చేయుచున్న శుభసందర్భంగా మా హృదయ పూర్వక శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు
రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు
వావిలపల్లి నారాయణ స్వామి
Rtd. ప్రిన్సిపాల్, ఇబ్రహీంబాద్, ఎచ్చెర్ల (మండలం)
ఇబ్రహీంబాద్ టిడిపి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు
గౌ॥ శ్రీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు గారు
కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు
4 SEASONS
MULTI CUISINE RESTAURANT
Day & Night Jn., Sindura Hospital Road
Srikakulam, © 9676927481, 9542030665, 8186823360